క్లుప్తంగా

ఎస్‌డబ్ల్యూపీసీ పరిశీలన



ఎస్‌డబ్ల్యూపీసీలో సేంద్రియ ఎరువును పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ సత్యనారాయణ

రేగిడి: పనసలవలస గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని (ఎస్‌డబ్ల్యూపీసీ) ఈఓపీఆర్డీ ఏ.వి.సత్యనారాయణ మంగళవారం పరిశీలించారు. గ్రామాల్లో రోజూ చెత్తను సేకరించి ఎస్‌డబ్ల్యూపీసీకి తరలించాలని, దానితో సేంద్రియ ఎరువు తయారు చేయాలని క్లాప్ మిత్రలకు సూచించారు. అలాగే కేంద్రం వద్ద ఆకుకూరలు సాగు చేయాలని చెప్పారు. ఆయన వెంట సర్పంచ్ గోవిందరావు, స్వచ్ఛ భారత్ మండల కో–ఆర్డినేటర్ పద్మ, పంచాయతీ కార్యదర్శి గౌతమి ఉన్నారు.

లింగ నిర్ధారణ నేరం



మాట్లాడుతున్న ఆర్డీఓ రామ్మోహనరావు

బొబ్బిలి: గర్భస్థ లింగనిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని, ఆడపిల్లలను గర్భంలోనే తుంచేసే వారు శిక్షార్హులని ఆర్డీఓ జె.వి.వి.ఎస్.రామ్మోహనరావు అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం డివిజన్‌స్థాయి అధికారుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌స్థాయిలో ఎక్కడా లింగనిర్ధారణ పరీక్షలు జరగకుండా చూడాలన్నారు. మగ పిల్లలు, ఆడపిల్లలు అనే లింగబేధం ఉండరాదన్నారు. లింగనిర్ధారిత పరీక్షల నిరోధక చట్టాన్ని కఠినంగా అమలు చేయడం ద్వారా భ్రూణ హత్యలను నిరోధించవచ్చని తెలిపారు. పీఓఎస్‌సీటీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సంతోషి, ఐసీడీఎస్ పీఓ విజయలక్ష్మి, పలువురు వైద్యాధికారులు పాల్గొన్నారు.

సచివాలయ సందర్శన



సచివాలయ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

రాజాం సిటీ: మండలంలోని గార్రాజుచీపురుపల్లి గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు మంగళవారం సందర్శించారు. రికార్డులు పరిశీలించిన అనంతరం ఆయన సిబ్బందితో మాట్లాడుతూ సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. మనమిత్ర వాట్సాప్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, పెండింగ్ సర్వేలు, ఈకేవైసీ పూర్తిచేయాలని ఆదేశించారు. ఈస రీసులకు సంబంధించిన డబ్బులను ఎప్పటికప్పుడు ప్రభుత్వ ఖాతాకు జమచేయాలని తెలిపారు.

తాగునీటి వనరుల క్లోరినేషన్



ఓవర్‌హెడ్ ట్యాంకును శుభ్రం చేస్తున్న కార్మికులు

వంగర: మండల కేంద్రంలోని తాగునీటి వనరులు, రక్షిత మంచినీటి పథకం ఓవర్ హెడ్ ట్యాంకును స్థానిక సర్పంచ్ కనగల భారతి మంగళవారం శుభ్రం చేయించారు. కార్మికులు ఓవర్ హెడ్ ట్యాంకులో నీటిని పూర్తిగా బయటకు తోడి శుభ్రం చేశారు. అనంతరం బ్లీచింగ్ పౌడర్ చల్లారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రజలకు రక్షిత మంచినీటిని అందిస్తున్నామని చెప్పారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



విద్యార్థులతో యోగాసనాలు వేయిస్తున్న లైబ్రేరియన్ సత్యవాణి

రామభద్రపురం: నిత్యం యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని స్థానిక శాఖా గ్రంథాలయం అధికారి సత్యవాణి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు మంగళవారం యోగాపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో పలు యోగాసనాలు వేయించారు. అనంతరం విద్యార్థులతో పుస్తకపఠనం చేయించారు. వేమన పద్యాలు చదివించారు. టంగుటూరి ప్రకాశం పంతులు జీవిత విశేషాలను వివరించారు.

అధ్వాన దారుల్లో.. అవస్థల ప్రయాణం

రాష్ట్రంలో గోతులు తేలిన రోడ్లన్నింటికీ సంక్రాంతి పండగ నాటికి మరమ్మతులు చేయిస్తామని, ఇతర ప్రాంతాల నుంచి గ్రామాలకు వచ్చే వారు రోడ్లను చూసి గర్వపడేలా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. కానీ ఆయన హామీ ఆచరణకు నోచుకోలేదు. కొన్ని రోడ్లకు తూతూ మంత్రంగా మరమ్మతులు చేసి అంతా చేసేశాం అన్నట్లు ప్రచారం చేసుకున్నారే తప్ప చాలా గ్రామాల రోడ్ల వైపు కన్నెత్తి కూడా చూడలేదు. సంక్రాంతి పండగ వెళ్లి పోయి నాలుగు నెలలు పూర్తవుతున్నా రోడ్ల మరమ్మతులకు సంబంధించి ఎక్కడా అతీగతీ లేదు. రాజాం, బొబ్బిలి నియోజకవర్గాల్లోని పలు ప్రధాన రహదారులు గోతులు తేలి అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. వీటికి మరమ్మతులు చేయించే నాథుడే కరువయ్యాడు. ఫలితంగా ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే ప్రయాణికులు, వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు.



రేగిడి: సోమరాజుపేట వద్ద గోతులు తేలిన రోడ్డు



రేగిడి: ఉంగరాడమెట్ట వద్ద రోడ్డు దుస్థితి

రేగిడి: మండలంలోని అంబకండి, సోమరాజుపేట, ఉంగరాడ, వన్నలి, వండానపేట గ్రామాలకు వెళ్లే రోడ్డు పూర్తిగా గోతులు తేలాయి. చినుకుపడితే చాలు ఈ గోతులు చెరువుల్లా మారుతున్నాయి. గోతుల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రధానంగా ద్విచక్ర వాహన చోదకులు అదుపుతప్పి పడిపోతూ గాయాల పాలవుతున్నారు. అలాగే మండలంలోని పాలకొండ–ఉంగరాడమెట్ట ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. విశాఖపట్నం వెళ్లే రోడ్డు కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ రోడ్డుకు సంబంధించి పునరుద్ధరణ పనులు చేపట్టింది. అయితే కొంతమంది వ్యాపారులు మెట్ట వద్ద రోడ్డుపైనే వాడుకనీరు వదిలేయడంతో పాటు భారీ వాహనాల రాకపోకల వల్ల రోడ్డు పాడైంది. ఈ రోడ్లకు ఎప్పుడు మరమ్మతులు చేస్తారా అని ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు ఎదురు చూస్తున్నారు.



రేగిడి: పాలకొండ- ఉంగరాడమెట్ట ప్రధాన రహదారిలో చిన్నయ్యపేట జంక్షన్ వద్ద రాళ్లు తేలిన రోడ్డు



తెర్లాం: గోతులమయమైన పెరుమాళి- సుందరాడ రోడ్డు



వంగర: మడ్డువలస వద్ద శిథిలమైన రోడ్డు



వంగర: జగన్నాథవలస సమీపంలో రోడ్డు మధ్యలో గొయ్యి



తెర్లాం: నెమలాం వద్ద తారు తొలగిపోయి అధ్వానంగా ఉన్న పెరుమాళి-సుందరాడ రోడ్డు

ప్రయాణం చేసేదెలా..?

తెర్లాం: మండలంలోని పెరుమాళి–సుందరాడ బీటీ రోడ్డు ఎక్కడికక్కడ గోతులు తేలడంతో ఈ మార్గంలో ప్రయాణాలు సాగించే వారు నానా అవస్థలు పడుతున్నారు. తారు తొలగి గుంతలు పడడంతో పాటు మెటల్ పైకి తేలడంతో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పుతున్నాయి. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రోడ్డుకు మరమ్మతులు చేయించాలనే ఆలోచన అధికారులకు రాకపోవడం బాధాకరమని ప్రయాణికులు, వాహన చోదకులు వాపోతున్నారు.

అడుగుకో గొయ్యి...

వంగర: మండలంలోని మడ్డువలస జంక్షన్ నుంచి నీలయ్యవలస గ్రామానికి వెళ్లే రోడ్డు అడుగుకో గొయ్యితో దర్శనమిస్తోంది. రెండు కిలోమీటర్ల దూరం ఉన్న ఈ మార్గంలో కొంత భాగం సిమెంట్ రోడ్డు కాగా కొంత భాగం బీటీ రోడ్డు. ఈ రోడ్డు పునరుద్ధరణకు నిధులు మంజూరయ్యాయని కూటమి నేతలు చెబుతున్నా పనులు మాత్రం ప్రారంభం కావడం లేదు.

గిరిపుత్రులకు నిత్య నరకం

బొబ్బిలిరూరల్: కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి ప్రాధాన్యతగా గిరిజన గ్రామాలకు రోడ్లు వేయిస్తాం...ఎవ్వరూ నిరాశపడకండి, ఇది నా హామీ అంటూ గిరిజనులకు ఎన్నికల సమయంలో ప్రస్తుత ఎమ్మెల్యే బేబి నాయన వాగ్దానం ఇచ్చారు.వారంతా ఆయన మాటను నమ్మి ఓటేసి గెలిపించారు. తీరా గెలిచిన తర్వాత గిరిజనులకు ఇచ్చిన మాటను ఎమ్మెల్యే విస్మరించారు. మండలంలోని సీహెచ్.బొడ్డవలస పరిధిలోని బట్టివలస, కేశాయవలస, చిలకంవలస తదితర గ్రామాలకు రోడ్డు సదుపాయం లేవు. ఆయా గ్రామాల గిరిజనులు మట్టి ,కంకర దారిలోనే రాకపోకలు సాగిస్తున్నారు.వర్షా కాలంలో నడిచి కూడా వెళ్లలేని దుస్థితి వీరిది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరైనా అటవీశాఖ అభ్యంతరాలతో రోడ్ల నిర్మాణం ఆదిలోనే నిలిచిపోయింది. ఇక బొబ్బిలి నుంచి రామన్నదొరవలస మీదుగా డొంగురువలస,మోసూరువలస తదితర గ్రామాల రోడ్ల నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏపీఆర్ఆర్‌పీ ప్రాజెక్టు కింద సుమారు రూ.8 కోట్లు మంజూరు చేయగా సంబంధిత కాంట్రాక్టర్ మెటల్ వేసి మిగతా పనులను ప్రారంభించలేదు. సరైన రోడ్డు సదుపాయం లేకపోవడంతో రాకపోకలు సాగించేందుకు గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు.



బొబ్బిలిరూరల్: బట్టివలస గిరిజన గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డు



బొబ్బిలిరూరల్: రాళ్లుతేలి ప్రమాదకరంగా ఉన్న డొంగురువలసరోడ్డు



బొబ్బిలిరూరల్: అటవీశాఖ అభ్యంతరంతో అర్ధంతరంగా నిలిచిన కేశాయవలస రోడ్డు పనులు

తాగునీటి సమస్య తలెత్తకూడదు

రేగిడి: వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ శ్యామల కుమారి ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందికి సూచించారు. స్థానిక మండ ల పరిషత్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్‌తో కలిసి పలుశాఖల అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏదైనా గ్రామంలో తాగునీటి సమస్య ఉంటే మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్ నంబర్ 95022 20951కు ఫోన్‌లో ఫిర్యాదు చేయాలని చెప్పారు. పారంపేట, ఒప్పంగి, మునకలవలస, బాలకవివలస, కాగితాపల్లి, బొడ్డవలస, జోడిబందల తదితర గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈఓపీఆర్డీ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీడీఓ శ్యామలకుమారి

24న ఎన్‌ఆర్ఐ ఆస్పత్రిలో వైద్యశిబిరం



మాట్లాడుతున్న రోటరీ క్లబ్ జిల్లా చైర్మన్ జేసీ రాజు

బొబ్బిలి: స్థానిక ఎన్‌ఆర్ఐ ఆస్పత్రిలో ఈనెల 24న నిర్వహించనున్న ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రోటరీ క్లబ్ జిల్లా చైర్మన్ జేసీ రాజు సూచించారు. రోటరీ క్లబ్ భవనంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోటరీ క్లబ్, ఎన్‌ఆర్ఐ ఆస్పత్రి సంయుక్తంగా ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రక్తహీనత, రక్తనాళాలు ఉబ్బడం వంటి సమస్యలు ఉన్న వారు ఉచితంగా వైద్యసేవలు పొందవచ్చని చెప్పారు. 4 వేలు విలువచేసే వాస్కులర్ డోపులర్ టెస్ట్‌ను ఉచితంగా చేస్తామని, రక్తనాళాల వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న రోగులకు ఇదో మంచి అవకాశమని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎన్‌ఆర్ఐ ఆస్పత్రి సీఈఓ శ్రీనివాస్, కార్యదర్శి కె.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామదేవతల పండగ



బాడంగి: పినపెంకిలో ఘటాలతో మంతాలమ్మ ఆలయానికి వెళుతున్న భక్తులు

బాడంగి: పినపెంకి గ్రామంలో మంతాలమ్మ పండగను గ్రామస్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు, మహిళలు మేళతాళాల మధ్య ఘటాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీ సులు బందోబస్తు నిర్వహించారు.



తెర్లాం: కుసుమూరులో సిరిమాను ఊరేగింపును తిలకిస్తున్న భక్తులు

కుసుమూరులో సిరిమానోత్సవం

తెర్లాం: మండలంలోని కుసుమూరులో గ్రామదేవతలు పాదాలమ్మ, పెద్దపైడమ్మ పండగ సందర్భంగా మంగళవారం సాయంత్రం సిరిమానోత్సవం నిర్వహించారు. పూజారి ఆదినారాయణ సిరిమానును అధిరోహించగా గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. సిరిమానోత్సవాన్ని తిలకించేందుకు చుట్టు పక్క గ్రామాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. గ్రామస్తులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి, పసుపు,కుంకుమ, చీర లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సిరిమానోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు ఆధ్వర్యంలో తెర్లాం ఎస్ఐ సాగర్‌బాబు, పోలీస్ సిబ్బంది బందోబస్త్ నిర్వహించారు. పండగ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమా లు ఏర్పాటు చేశారు.

సంగాంలో సంబరాలు

వంగర: సంగాం గ్రామంలో అయిదురోజుల పాటు నిర్వహించనున్న వీరభద్రస్వామి, కన్యకాపరమేశ్వరి, వేంకటేశ్వరస్వామి, సత్యనారాయణస్వామి సంబరాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. వివిధ ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్న పూసర్ల కుటుంబ సభ్యులు 20 ఏళ్ల తర్వాత ఈ సంబరాలు జరుపుతున్నారు. అయిదు రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

బొబ్బిలిలో మినీమహానాడు

బొబ్బిలి: తెలుగుదేశం పార్టీ మినీమహానాడు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బేబినాయన అధ్యక్షతన కోటలో మంగళవారం నిర్వహించారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అతిథిగా హాజరై టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో పాటు టీడీపీ ఆశయాలను, సిద్ధాంతా లను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. ఎమ్మెల్యే బేబినాయన మాట్లాడుతూ పార్టీకోసం కష్టపడే వారికి తగిన గుర్తింపు, గౌరవం ఉంటుందన్నారు. మాజీ ఎమ్మెల్యే, బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు, నియోజకవర్గ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

బొబ్బిలి: సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా స్థానిక సీహెచ్‌సీలో రోగులకు నందమూరి యువసేన అధ్వర్యంలో మంగళవారం పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు, యువసేన సభ్యులు పితాని శ్రీనివాసరావు, పడాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లో చెత్తపారబోయవద్దు



కోరాడవీధిలో కాలువను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: చెత్తను కాలువల్లో, వీధుల్లో పారబోయవద్దని, ఇళ్ల వద్దకు వచ్చే పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి పట్టణ వాసులకు సూచించారు. పట్టణంలోని బలిజిపేట రోడ్డు, నాగవంశపు వీధి, కోరాడ వీధుల్లో మంగళవారం ఆమె పర్యటించారు. ఆయా వీధుల్లో కాలువలు, పరిసరాలను పరిశీలించారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్తను,సిల్ట్‌ను తొలగించాలని పారిశుద్ధ్యకార్మికులకు సూచించారు. ఆమె వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీ, పబ్లిక్ హెల్త్ మేస్త్రీలు, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు ఉన్నారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి

రేగిడి: స్త్రీనిధి, ఇతర రుణాలను సద్వినియోగించుకుని డ్వాక్రా సంఘాల్లోని సభ్యులంతా ఆర్థికాభివృద్ధి సాధించేలా చూడాలని రాజాం వెలుగు ఏరియా కో–ఆర్డినేటర్ ఏ.చిరంజీవి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పలు గ్రామాల వీఓఏలు, ఎన్యుమ రేటర్లకు సంఘాల నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలపై మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ సభ్యుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు కృషి చేయాలని, స్త్రీనిధి రుణాలతో చిరువ్యాపారాలు చేసేలా చూడాలని అన్నారు. సంఘాలన్నీ ఏ- గ్రేడ్‌లో ఉండాలని చెప్పారు. ఏపీఎం గోవిందరావు, సీసీలు పాల్గొన్నారు.



శిక్షణకు హాజరైన వీఓఏలు, ఎన్యుమరేటర్లు

కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

రాజాం సిటీ: స్థానిక మున్సిపాలిటీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మి, అనీల్ కుమార్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రామప్పలనాయుడుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా ఆవిర్భవించి నేటికి 20 ఏళ్లు అవుతున్నా ఇంత వరకు కార్మికుల సంఖ్య పెరగలేదని అన్నారు. పట్టణ విస్తీర్ణానికి అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచక పోవడంతో పనిభారం పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందని, ఇప్పటికైనా కార్మికుల సమస్యలపై దృష్టిసారించాలని కోరారు.మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు సీహెచ్.రామ్మూర్తినాయుడు, గురువులు, బాలరాజు, వైకుంఠరావు, వాసు, తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ఫారం పాండ్లపై అవగాహన కల్పించండి

రేగిడి: ఫారం పాండ్ల వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించాలని డ్వా మా పీడీ శారదాదేవి ఉపాధి సిబ్బందికి సూచించారు. ఉపాధి పనులపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో భాగంగా రైతుల పొలాలు, తోటల్లో ఫారం పాండ్లు తవ్విస్తున్నట్లు చెప్పారు. అలాగే పంచాయతీల్లో సోక్ పిట్స్, కంపోస్టు పిట్స్ తవ్వించాలని సూచించారు. ఈఓపీఆర్‌డీ సత్యనారాయణ, ఉపాధి హామీ ఏపీఓ ఎస్.హరనాథ్, ఈసీ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డ్వామా పీడీ శారదాదేవి

యోగా మాసోత్సవాలను విజయవంతం చేద్దాం

తెర్లాం: జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 21 నుంచి నిర్వహించనున్న యోగా మాసోత్సవాలను అన్ని శాఖల అధికా రులు, సిబ్బంది కలిసి విజయవంతం చేద్దామని ఎంపీడీఓ రేగి రాంబాబు, తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్ నుంచి జేసీ సేతు మాధవన్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు మండల అధికారులతో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో హాజరయ్యారు. అనంతరం ఎంపీడీఓ, తహసీల్దార్ మాట్లాడుతూ యోగా మాసోత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని యోగాసనాలు వేయాలన్నారు.

బాడంగి: యోగా మాసోత్సవాల్లో భాగంగా మండల స్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై మండలంలోని వివిధ శాఖల అధికారులకు ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ మంగళవారం అవగాహన కల్పించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు, స్వచ్ఛంద సంఘాలు యోగా మాసోత్సవాల్లో పాల్గొనేలా చూడాలన్నారు.మండల స్థాయిలో ఎంటీఓగా పనిచేస్తున్న యోగా టీచర్ ప్రతీ గ్రామం నుంచి ఒక టీఓటీని ఎంపికచేసి వారికి శిక్షణ ఇచ్చి వారితో ప్రతీ గ్రామపంచాయతీలో యోగా శిక్షణ తరగతులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. మే 21నుంచి జూన్ 21 వరకు నెల రోజులపాటు మండల స్థాయి కమిటీ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.